క్లుప్తంగా

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాంప్రసాద్



రాంప్రసాద్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి.రాంప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లిమర్ల జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా ఉన్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

కల్యాణ మండపం పనుల పరిశీలన

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ పరిధి స్వర్ణభారతినగర్‌లో నిర్మాణ దశలో ఉన్న కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. త్వరితగతిన కల్యాణ మండపం నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, చెట్టిపల్లి గోపి, సాకరి శ్రీనివాస్, సారిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కారులో మంటలు



ప్రమాదానికి కారణమైన కారు

కొమ్మాది: విశాఖపట్నం నుంచి ఎండాడ వైపుగా మధురవాడ వెళ్తున్న ఓ కారు ఇంజిన్ నుంచి మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన కారులో ప్రయాణిస్తున్న వారు వెంటనే ఎండాడ జంక్షన్‌లో కారును నిలిపివేసి, మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. కాసేపు తరువవాత మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే సదస్సులు



సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ ఆనందరావు

పద్మనాభం: రైతుల సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. మండలంలోని నరసాపురంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, దరఖాస్తులు స్వీకరించారు. సదస్సులో 85 దరఖాస్తులు వచ్చాయి. మ్యుటేషన్ కోసం 24 మంది, కులం సర్టిఫికెట్లకు 36 మంది, సర్వేకు 23 మంది, 22ఏ కు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుంకర బంగారప్పడు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

పీఎం పాలెం: చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందిన ఘటనపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పీఎం పాలెం పరిధి సాయి ప్రియా గార్డెన్స్‌లో మందిపాటి సాయిరాజు కుటుంబంతో నివసిస్తున్నాడు. అతని కుమారుడు బాలాజీరాజు (10) ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం ఫిట్స్ వచ్చి మెట్లపై పడిపోవడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో అదేరోజు నగరంలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మినీ జెట్టీ నిర్మాణం ఎప్పుడో?



మినీ జెట్టీ నిర్మాణానికి తీరంలో ఎంపిక చేసిన స్థలం

భీమునిపట్నం: భీమిలి తీరంలో మినీ జెట్టీ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మత్స్యకారులకు నిరీక్షణే మిగులుతోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభం అయ్యే సమయానికి ప్రభుత్వం మారిపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చినట్లయింది.

ఇక్కడి తీరం నుంచి రోజూ 200కు పైగా మోటారు పడవలు, తెప్పలు చేపల వేటకు వెళ్లి వస్తుంటాయి. అలాగే, బీచ్‌రోడ్డులోని చేపలు ప్పాడ, మంగమారిపేటకు సంబంధించిన పడవలు కూడా కొన్ని ఇక్కడకు వస్తుంటాయి. ఈ తీరం వద్ద పెద్ద రాళ్లు అనేకం ఉండడంతో ఇవి సముద్రంలోకి నేరుగా వెళ్లి రావడానికి ఇబ్బందిగా ఉండడంతో గోస్తని నది ద్వారా వెళ్లి వస్తుంటాయి. ఇది వారికి ఎంతో సురక్షితంగా ఉంటుంది. అలాగే పక్కనే ఉన్న పెదనాగమయ్యపాలెం, అన్నవరం ప్రాంతాలకు చెందిన పెద్ద మోటారు పడవలు కూడా గోస్తని ద్వారా వెళ్లి వస్తున్నాయి. కానీ, వేసవి ప్రాంతంలో గోస్తని నదిలో ఇసుక మేటలు వేయడంతో ఆ అవకాశం ఉండదు. అప్పుడు నేరుగా సముద్రంలోకి వెళ్లి రావలసి ఉండడంతో తరచు పడవలు రాళ్లకు తగిలి ప్రమాదాలు జరిగి, తీవ్ర నష్టం వాటిల్లడంతో పాటు కొందరు ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. ఇక తీరంలో పడవలు తుపాన్లు వచ్చే సమయాల్లో దెబ్బ తినడం, సముద్రంలోకి కొట్టుకుపోతుండడంతో ఆ నష్టాన్ని కూడా భరించవలసి వస్తోంది. ఏళ్ల తరబడి ఉన్న సమస్య పరిష్కారం కోసం మత్స్యకారులు తమకు ఇక్కడ తీరంలో మినీ జెట్టీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రూ.28 కోట్లు మంజూరు

ప్రభుత్వం మారడంతో ప్రారంభం కాని పనులు

మత్స్యకారులకు తప్పని అవస్థలు

ప్రభుత్వం మారడంతో ప్రశ్నార్థకం

జెట్టీ నిర్మాణానికి నిధులు కూడా మంజూరై, పనులు ప్రారంభమవుతాయని భావించగా, ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయింది. దీంతో ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ నిర్మాణం మొదలు కావాలంటే ప్రస్తుత ప్రభుత్వం స్పందించి, పనులు ప్రారంభించారు. కానీ ఎప్పుడు ప్రారంభిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. పాలకులు, అధికారులు స్పందించి జెట్టీ నిర్మాణాన్ని సాకారం చేయాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మంజూరు

మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భీమిలికి మినీ జెట్టీ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి, రూ.28కోట్లు మంజూరు చేశారు. ఇందుకోసం అధికారుల బీచ్ వద్ద స్థలాన్ని కూడా పరిశీలించారు. మినీ జెట్టీ నిర్మాణం జరిగితే పెద్ద ప్లాట్‌ఫాం నిర్మిస్తారు కనుక వేటకు వెళ్లి వచ్చే పడవలు, తెప్పలు తీరం వరకు రాకుండా సురక్షితంగా నిలుపుకోవచ్చని, తుపాను సమయాల్లోనూ అలలు ఎంత ఉధృతంగా వచ్చినా ఎటువంటి నష్టం వాటిల్లదని మత్స్యకారులు ఆనందపడ్డారు. అంతేకాకుండా దగ్గరలోనే పెద్ద హాలు వంటిది నిర్మిస్తే వలలు, మోటార్లు, ఇతర సామగ్రిని భద్రపరుచుకోవడంతో పాటు చేపలను వేలం వేసుకుని విక్రయించడానికి సదుపాయంగా ఉంటుంది. అలాగే ఉపాధి అవకాశాలు కూడా బాగుంటాయని ఎంతో ఆనందించారు.

ఎంతో ఆనందపడ్డాం



ఎన్నో సంవత్సరాలుగా చాలా అవస్థలు పడుతూ చేపల వేటను సాగిస్తున్నాం. మినీ జెట్టీ నిర్మిస్తారని ఎంతో ఆనందపడ్డాం. ఆ నిర్మాణం పూర్తయితే నష్టాలు ఉండవని ఆశపడ్డాం. కానీ ఇప్పుడు పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయో కూడా తెలియడం లేదు. ప్రభుత్వం స్పందించి మా కష్టాలు తీర్చాలి.

– వాడమొదల నూరిబాబు, మత్స్యకారుడు, భీమిలి

చాలా కష్టంగా ఉంటుంది



ఇక్కడ మినీజెట్టి లేక పోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉంది. రోజూ సముద్రంలోకి వెళ్లి తీరానికి రావడానికి ఎంతో సమస్యగా ఉంటోంది. తుపాన్ల సమయంలో బాగా నష్టపోతున్నాం కూడా.

– కదిరి అప్పలరాజు, మత్స్యకారుడు, భీమిలి

ప్రభుత్వం స్పందించాలి



ఇక్కడ జెట్టీ మంజూరైంది కదా, ప్రస్తుత ప్రభుత్వం దీనిపై స్పందించాలి. మత్స్యకారులకు ఎంతో ప్రయోజనకరమైన జెట్టీ నిర్మాణాన్ని ప్రారంభించి, త్వరగా పూర్తి చేస్తే అందరికీ ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో విధాలుగా నష్టపోతున్న మత్స్యకారులకు జెట్టీ నిర్మాణం ఎంతో అవసరం.

– అల్లిపిల్లి నర్సింగరావు, మత్స్యకార నాయకుడు



సముద్రంలోకి కలిసే గోస్తని నది (దీనిద్వారానే పడవలు సముద్రంలోకి వెళ్లి వస్తాయి.. వేసవిలో ఈ మార్గం పూర్తిగా మూసుకుపోతుంది



తీరంలో తాళ్లు కట్టి ఉంచిన పడవలు, తెప్పలు



తీరంలో వలలను అల్లుకుంటున్న మత్స్యకారులు

బాల్యం నుంచి దేశభక్తిని అలవరచుకోవాలి



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న మధుకర్

పద్మనాభం: విద్యార్థినులు చిన్నతనం నుంచి దేశభక్తిని అలవరుచుకోవాలని బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.మధుకర్ అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన వీర బాల్ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి వంటి వీరుల త్యాగాలను ఈ తరం గుర్తుంచుకుని, వారి బాటలో పయనించాలన్నారు. ముందుగా ఆయన జొరావర్ సింగ్, ఫతేసింగ్ చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, హంస మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత రక్షణకు సమన్వయ కమిటీ

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



కోతకు గురైన తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని తీర ప్రాంతం అనేక చోట్ల తుపాను కారణంగా కోతకు గురైన నేపథ్యంలో మళ్లీ ఆ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, ఇతర అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భీమిలిలోని తీరప్రాంతాన్ని, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెయిన్‌రోడ్డుతో పాటు, బీచ్‌రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్లను విస్తరించవలసి ఉందని, దీనివల్ల అందరికీ ఎంతో సదుపాయంగా ఉంటుందని అన్నారు.

అధికారులెక్కడ?

జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణితో పాటు ఇతర అధికారులు రాకపోవడంపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వస్తున్నట్టు తెలిసినా ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇలా మళ్లీ జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్డీవో సంగీత్ మాథూర్, ఏసీపీ రామకృష్ణ ఉన్నారు.

తర్లువాడలో లేగదూడల ప్రదర్శన



పాడి రైతులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ శారదా ప్రియాంక

తగరపువలస: శాస్త్రీయ యాజమాన్య పద్ధతులలో దూడల పెంపకం చేపట్టడం రైతులకు లాభదాయకమని ఆనందపురం ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ నిధులతో మంగళవారం తర్లువాడలో ఏర్పాటు చేసిన కృత్రిమ గర్భధారణతో పుట్టిన లేగదూడల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పశువులకు సకాలంలో నట్టల నివారణ మందులు వేయించాలని రైతులకు సూచించారు. జిల్లా పశు సంవర్థకశాఖ జేడీ డాక్టర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యం 60 శాతం రాయితీతో అందిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులంతా వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా లేగదూడల ప్రదర్శనకు 42 దూడలు వచ్చాయి. రైతులందరికీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, పశు సంవర్థకశాఖ ఏడీ సజ్జ శ్రీనివాసరావు, డాక్టర్ మాదీనా ప్రసాద్, డీఎల్‌డీఏ పశువైద్యాధికారి సౌజన్య, మండల పశువైద్యాధికారి పి.అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చీటీల సొమ్ము స్వాహా చేసిన వారిపై కేసు నమోదు

తగరపువలస: జీవీఎంసీ1, 2 వార్డుల్లో రూ.2 కోట్ల చీటీల సొమ్ము స్వాహా చేసిన నిర్వాహకులు సరగడ ఉమ, షేక్ సమీర్‌లపై భీమిలి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వలందపేటకు చెందిన కొల్లి హరినాథ్ రెడ్డితో పాటు బాధిత గ్రామస్తులు కొందరు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. వీరిలో ఉమ ది రెండోవార్డు వలందపేట కాగా, సమీర్‌ది ఒకటోవార్డు నరగపు వీధి. నిందితులు 2022 నుంచి చీటీల సొమ్ము వసూలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పద్మనాభం: ఇష్ట దైవాన్ని నమ్మకంతో కొలిచినప్పుడే మేలు జరుగుతుందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్దిలో మంగళవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఎంపీపీ రాంబాబును పాస్టర్ కాళ్ల సుధాకర్ దుశ్శాలువాతో సన్మానించారు. వేడుకల్లో భాగంగా క్రైస్తవులు ఏసుక్రీస్తు పాటలను ఆలపించారు.

క్రిస్మస్ శోభ

పురాతన చర్చిలకు సరికొత్త కాంతులు



తగరపువలస దుకాణాలలో క్రిస్మస్ ట్రీ, స్టార్స్ విక్రయాలు



కొండపేట జీవం గల దేవుని సంఘం చర్చి బయట క్రిస్మస్ ట్రీ





చిట్టివలస లండన్ మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

తగరపువలస: క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఏసు క్రీస్తు జన్మించిన పర్వదినాన్ని ఘనంగా జరుపుకొనేందుకు క్రైస్తవులు పెద్ద ఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే నెలరోజుల నుంచి పలుచోట్ల మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రధాన పండగ కోసం ఇళ్లు, ప్రార్థనామందిరాలను అందంగా అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచే పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రార్థనలు ముగిసిన తరువాత కేక్ కటింగ్, ప్రేమ విందు, పేదలకు కానుకల పంపిణీ వంటివి చేపట్టనున్నారు. తగరపువలస మార్కెట్‌లో స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్ బొమ్మలు, టోపీలు, వివిధ రకాల బహుమతుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

- రామన్నపేట సాయిరవీంద్ర, బంగ్లామెట్ట ఇన్‌క్రెడిబుల్ ప్లే స్కూల్ విద్యార్థులు మంగళవారం క్రిస్మస్ వేడుకలు జరుపుకొన్నారు. కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే లఘునాటికలను, పలుకులను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన, గీతాలాపన, శాంతాక్లాజ్, దేవదూతలు, గొర్రెల కాపరి వేషధారణలు ఆకట్టుకునాయి.

పురాతన చర్చిల్లో..

భీమునిపట్నం: భీమిలిలో రెండు పురాతన చర్చిలు క్రిస్మస్‌కు ముస్తాబయ్యాయి. 1864లో కీతిన్‌పేట వద్ద బిషప్ జెల్ నిర్మించిన సెయింట్ పీటర్స్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. ప్రార్థన హాల్లో సుమారు 20 అడుగుల ఎత్తులో గాజుపలకలపై ఏర్పాటు చేసిన జీసస్ బొమ్మ నేటికీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కెనడియన్ మిషనరీ 1874లో బ్యాంకురోడ్డులో నిర్మించిన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది.

- కీతిన్ పేట వద్దనున్న సన్‌స్కూల్లో డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రీస్తు జననానికి సంబంధించి చిన్నారుల ప్రదర్శన ఆకట్టుకుంది.



విద్యుత్ వెలుగుల్లో ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి



దేదీప్యమానంగా సెయింట్ పీటర్స్ చర్చి



సన్ స్కూల్‌లో జరిగిన వేడుకలో పాల్గొన్న విద్యార్థులు



క్రీస్తు సందేశాన్ని ప్రదర్శిస్తున్న సాయి రవీంద్ర విద్యార్థులు

తలసేమియా బాధితుల కోసం రక్తదానం



పెద్దిపాలెంలో రక్తదానం చేస్తున్న యువకులు

తగరపువలస: తలసేమియా బాధితుల కోసం ఓఎస్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆనందపురం మండలం పెద్దిపాలెంలో నిర్వహించిన శిబిరంలో 45 మంది యువకులు, సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరంలో మరో 20 మంది రక్తదానం చేశారు. ఫౌండేషన్ అధినేత దళాయి శివ మాట్లాడుతూ తలసేమియాతో పాటు కిడ్నీ పేషెంట్లు, గర్భిణులు, చిన్నారులకు అత్యవసర సమయాలలో రక్తదానం చేస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేసి, రక్తం కొరత లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అనిల్ నీరుకొండ బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ కుంచం గోవింద అప్పలరాజు పాల్గొన్నారు.